

నయా నగరం

బెంగళూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు అధికార (జీబీఏ) ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శాసనసభ ఉభయసభలలోనూ ఆమోదం తెలిపారు. పకడ్బందీ పాలనకు ప్రత్యేక అధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబరు 2న మంగళవారం నుంచి అస్థిత్వానికి వ చ్చే గ్రేటర్ బెంగళూరు పరిధిలోని ఐదు పాలికెల పాలనా వ్యవస్థ సజావుగా సాగేందుకు 15 మంది ఐఏఎస్ అధికారులను, ఇద్దరు ఐపీఎస్ అధికారుల పోస్టులు కేటాయించారు. కేఏఎస్ స్థాయి అధికారులు 15మందిని నియమించారు. ప్రస్తుతం పాలన సాగిస్తున్న బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)కి మంజూరైన పోస్టులను పేరు మార్చి ఆదేశాలు జారీ చేయనున్నారు.



గ్రేటర్ బెంగళూరుకు ఐఏఎస్ స్థాయిల వివరాలు

చీఫ్ కమిషనర్

స్పెషల్ కమిషనర్ (పాలన, రెవెన్యూ ఐటీ విభాగం)

స్పెషల్ కమిషనర్ (వైద్య, విద్య)

స్పెషల్ కమిషనర్ (ఎన్నికలు, విపత్తు నిర్వహణ, సమాచార)

స్పెషల్ కమిషనర్ (ఆర్థికస్థాయి ముఖ్య అధికారి)

ఐదు పాలికెలకు ఒక్కో కమిషనర్ - అభివృద్ధి పర్యవేక్షణ

ఐపీఎస్ అధికారులు

ఎస్పీ, ఏడీజీపీ - బీఎంటీఎఫ్, జీబీఏ

కేఏఎస్ అధికారులు- ప్రతి విభాగంలోనూ అదనపు కమిషనర్‌గా రెవెన్యూ విభాగాన్ని పర్యవేక్షిస్తారు.

డివిజనల్ జాయింట్ కమిషనర్ - ప్రతి పాలికెలో ఇద్దరు

డిప్యూటీ పోలీస్ అధికారి - బీఎంటీఎఫ్‌ను పర్యవేక్షిస్తారు.

మారనున్న నగర పాలనా స్వరూపం

గ్రేటర్ బెంగళూరుకు 15 ఐఏఎస్ పోస్టులు

ఐదు పాలికెలకు సిబ్బంది కేటాయింపు

పాలనా సౌకర్యం కొరకు 450 వార్డులు

నేడు తుది గెజిట్

సర్వాధికారాలు కమిషనర్‌కే..



జీబీఏ చీఫ్ కమిషనర్ మహేశ్వర రావు

గ్రేటర్ బెంగళూరు అథారిటీకి చీఫ్ కమిషనర్ పాలనా వ్యవహారాల పూర్తి స్థాయి అధికారం కలిగి ఉంటారు. నలుగురు స్పెషల్ కమిషనర్‌లు వివిధ విభాగాలను పర్యవేక్షిస్తారు. కొత్తగా రూపొందించిన ఐదుపాలికెలలో ఒకరు కమిషనర్‌గాను, మరొకరు అదనపు కమిషనర్‌గాను కొనసాగనున్నారు. ఐపీఎస్ స్థాయి ఇద్దరు అధికారులు, ఏడీజీపీ, ఎస్పీ హోదా కల్గిన వారు పర్యవేక్షిస్తారు. ప్రస్తుత బీబీఎంపీ కేంద్ర కార్యాలయం గ్రేటర్ బెంగళూరు కార్యాలయంగా మారిపోనుంది. ఇక్కడనుంచే చీఫ్ కమిషనర్, స్పెషల్ కమిషనర్‌లు కార్యకలాపాలు కొనసాగిస్తారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార సభ కూడా ఇక్కడే జరగనుంది. గ్రేటర్ బెంగళూరు చైర్మన్ హోదాలో సీఎం, వైస్ చైర్మన్ హోదాలో డీసీఎంలు వ్యవహరిస్తూ ఇక్కడనుంచే సభలు కొనసాగిస్తారు. ఇందుకోసం ప్రత్యేక చాంబర్‌లను సిద్ధం చేశారు.

ఐదు పాలికెల జనాభా వివరాలు

పాలికె పేరు	జనాభా లక్షలలో..	జనసాంద్రత (విస్తీర్ణం)
బెంగళూరు తూర్పు	13	7,738/చ.కి.మీ.
బెంగళూరు పశ్చిమ	45	27,950/చ.కి.మీ.
బెంగళూరు ఉత్తర	31	19,620/చ.కి.మీ.
బెంగళూరుదక్షిణ	30	20,408/చ.కి.మీ.
బెంగళూరు సెంట్రల్	25	32,501/చ.కి.మీ.

దశాబ్దాలకాలం కొనసాగిన బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ), గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ)గా ఏర్పడ్డాక ఐదు కొత్త పాలికెలు ఏర్పాటయ్యాయి. అందులో బెంగళూరు ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ, సెంట్రల్ పాలికెలుగా రూపొందించి గత నెలలోనే రెండు గెజిట్‌లను జారీ చేశారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలను ఆలకించి కొన్ని మార్పులు చేస్తూ మంగళవారం ప్రత్యేక నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వం తుది కసరత్తు సాగిస్తోంది. ఐదు పాలికెల ఏర్పాటు వేళ విస్తీర్ణంలో పెద్దవిగా ఉన్న వాటిలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన కారణంగా కొన్ని మార్పులు చేయాలని నిర్ణయించారు. ప్రతిపక్షనేత అశోక్ ప్రాతినిధ్యం వహిస్తున్న పద్మనాభనగర్ నియోజకవర్గాన్ని ఒకే పాలికెలోకి తీసుకురావాలని నిర్ణయించారు. అయితే తుది గెజిట్ నోటిఫికేషన్ ద్వారానే స్పష్టత రానుంది. ఐదు పాలికెలు కూడా అధికారికంగా నేటి నుంచి అస్థిత్వలోకి రానున్నాయి. అదేరోజున సాంకేతికంగాను కార్యకలాపాలు కొనసాగించనున్నాయి.

గ్రేటర్ బెంగళూరు సంస్థలు.. పోస్టుల వివరాలు

గ్రేటర్ బెంగళూరు	314
బి స్మైల్	107
కేంద్ర పాలికె	3678
తూర్పు పాలికె	2163
పశ్చిమ పాలికె	6024
ఉత్తర పాలికె	4315
దక్షిణ పాలికె	4215
సచివాలయ సిబ్బంది	1851
డివిజన్‌లు - ఫీల్డ్ సిబ్బంది	2784
సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్	89
బీఎంటీఎఫ్	27



అవసరమైన సిబ్బంది	26,389
బీబీఎంపీకి మంజూరైన పోస్టులు	22,411
బీబీఎంపీలో పనిచేస్తున్నవారు	18,790

450 వార్డులుగా విభజన

కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు పాలికెలలో మొత్తం 450 వార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించా రు. సంబంధిత పాలికెల విస్తీర్ణం, జనాభాను పరిగణించి కొత్తగా వార్డులు రూపొందించేలా బీబీఎంపీ విభజన కమిటీ తగు చర్యలను ప్రారంభించనుంది. ప్రతి పాలికెకు కనిష్టంగా 70, గరిష్ఠంగా 120కు మించకుండా వార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తూర్పు పాలికె విస్తీర్ణం, జనాభాలో ఎక్కువ ఉన్న కారణంగా ఆ కార్పొరేషన్ పెద్దది కానుంది. తూర్పు పాలికెలో తక్కువ వార్డులు ఉన్నాయి. నెలాఖరుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అక్టోబరు రెండో వారం తర్వాత వార్డులకు సంబంధించిన తుది గెజిట్ విడుదలయ్యే అవకాశం ఉంది.

డబ్బుల్ యాక్షన్..!

● నటనతోపాటు వ్యాపారంలో రాణిస్తున్న నటులు

బెంగళూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): సినిమాల్లో బిజీగా ఉంటూనే కొందరు నటులు ప్రత్యామ్నాయ వ్యాపారాలపై ఆసక్తి చూపుతున్నారు. క్రికెటర్లు, సినిమారంగానికి చెందినవారంటే సమాజంలో క్రేజ్ ఎక్కువగా ఉంటుంది. ఇదే అవకాశంగా తీసుకుని నటులు తమకు ఇష్టమైన, లాభాలు గడించేందుకోసం వ్యాపార రంగంలోకి అడుగు పెడుతున్నారు. మరోవైపు బెంగళూరు అంటే జాతీయస్థాయిలో నటులు, క్రీడాకారులకు ప్రత్యేక ఆసక్తి ఉంది. ప్రముఖ క్రికెటర్ విరాట్‌కోహ్లికి సంబంధించి పబ్ బెంగళూరులో ఉంది. చిన్నస్వామిస్టేడియం ఎదురుగానే టానిక్ బిల్డింగ్‌లో పబ్ ఉంది. ఇక మరో క్రికెటర్ ధోనికి సంబంధించి విద్యాసంస్థ నగరంలో ఉంది.

నటుడు కిచ్చా సుదీప్



శాండల్‌వుడ్‌లో అభినయ చక్రవర్తిగా పేరొందిన నటుడు కిచ్చా సుదీప్ కన్నడతోపాటు తెలుగు, తమిళ, హిందీ భాషల సినిమాల్లో రాణిస్తున్నారు. మరోవైపు బుల్లితెరపై బిగ్‌బాస్ హోస్ట్‌గా మరింత ప్రజాదరణ పొందారు. కిచ్చా క్రియేషన్స్ పేరిట ఓ నిర్మాణ సంస్థను కొనసాగిస్తున్నారు. దర్శక, నిర్మాతగాను వ్యవహరిస్తున్నారు. కర్ణాటకతోపాటు ముంబైలోనూ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్, ప్రొ-కబడ్డీ లీగ్ జట్ల ఫ్రాంచైజీ తీసుకున్నారు.

సృజన్ లోకేశ్



సినిమా రంగానికి చెందిన కుటుంబం లోకేశ్, గిరిజా లోకేశ్‌ల కుమారుడు సృజన్ లోకేశ్ నటుడిగా కొనసాగుతూనే పలు కార్యక్రమాలకు యాంకరింగ్ చేస్తున్నారు. తినుబండారాలతోపాటు హోటల్‌ను సృజన్ నిర్వహిస్తున్నారు. కేఎఫ్ఐ నటి అషితా చంద్రప్ప ఫ్యాషన్‌రంగంలో ఆసక్తితో ఓ బ్రాండెడ్ దుస్తుల షోరూంను నిర్వహిస్తున్నారు. ఇక షైన్‌శెట్టి యాంకర్‌గా, గాయకుడిగా పేరొందిన విషయం తెలిసిందే. బిగ్‌బాస్ 7సీజన్ విజేతగా నిలిచాక మరింత ప్రజాదరణ పొందారు. గల్లీ కిచెన్ పేరిట ఫుడ్ ట్రక్‌ను నిర్వహిస్తున్నారు. హోటల్ రంగంలో పెట్టుబడులకు సిద్ధమయ్యారు. మరోవైపు రియల్ ఎస్టేట్‌తోపాటు బ్రాండెడ్ దుస్తులు, ఓ ఎన్జీఓ సంస్థను పర్యవేక్షిస్తున్నారు. నటి నయన కేఎం శాండల్‌వుడ్‌లో సుపరిచితురాలు. ఓవైపు నటనలో బిజీగా ఉంటూనే బెంగళూరులో చీరల దుకాణం తెరిచారు. డిజైన్ దుస్తులు, వెరైటీ బ్లౌజ్‌లు, దుప్పట్లు విక్రయిస్తున్నారు.

నిర్మాణసంస్థ నడుపుతున్న యశ్



కేజీఎఫ్ సినిమా ద్వారా జాతీయస్థాయిలో తిరుగులేని నటుడిగా, శాండల్‌వుడ్‌లో అత్యంత ఎక్కువ వసూలు చేసిన చిత్రమే కాకుండా అత్యధిక పారితోషికం అందుకున్న నటుడిగా యశ్ నిలిచారు. మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పేరిట ప్రొడక్షన్ హౌసన్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం టాక్సిక్, రామాయణ్ సినిమాలను రూపొందిస్తున్నారు.

స్కూల్ ప్రారంభించిన పునీత్ భార్య అశ్విని



శాండల్‌వుడ్ సినిమాలోనే కన్నడ కంఠీరవుడు డాక్టర్ రాజ్‌కుమార్ తిరుగులేని నటుడిగా రాణించారు. ఆయన ముగ్గురు కుమారులు సినిమారంగంలో కొనసాగినవారే కర్ణాటక రత్న పునీత్‌రాజ్‌కుమార్ భార్య అశ్విని జూనియర్ ప్రైజ్ ఇంటర్నేషనల్ ప్రీ-స్కూల్‌ను ప్రస్తుత అకడమిక్ నుంచి ప్రారంభించారు. ఇలా సినిమారంగానికి చెందిన పలువురు హోటళ్లు, బ్రాండెడ్ దుస్తులతోపాటు రియల్ ఎస్టేట్ సహా వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఎంత బిజీగా ఉన్నా రూ.కోట్లు గడిస్తున్నారు.



వర్షంలోనూ ర్యాలీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, కార్యకర్తలు

ఉప్పెనలా..

● చలో ధర్మస్థలకు భారీ స్పందన

● కుట్రలు తేలాలంటే కేంద్ర దర్యాప్తు సంస్థలతోనే సాధ్యం: విజయేంద్ర



ప్రసంగిస్తున్న ప్రతిపక్షనేత అశోక్



బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర



కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

బెంగళూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలంగా ధర్మక్షేత్రంగా కొనసాగిన ధర్మస్థలపై ఇటీవల రెండు నెలలుగా సాగిన కుట్రలకు వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ చలో ధర్మస్థలకు బీజేపీ ఇచ్చిన పిలుపునకు భక్తులు, పార్టీ కార్యకర్తలు ఉప్పెనలా తరలివచ్చారు. సోమవారం ఉదయం నుంచి ధర్మస్థలలో జోరువాన కురుస్తున్నా భక్తజనం ర్యాలీలో ముందుకు నడిచారు. భారీ బహిరంగసభలో బీజేపీ అగ్రనేతలు భాగస్వామ్యులయ్యారు. చిక్కమగళూరు, దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ జిల్లాలనుంచి వేలాదిమంది భక్తులు తరలి రావడంతో ధర్మస్థల వీధులు జనసందోహమయ్యాయి. బహిరంగసభకు అధ్యక్షత వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ధర్మస్థల విషయంలో ముఖ్యమంత్రి వ్యవహరించిన విధానం సరిలేదన్నారు. భక్తులు తలచుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. హిందూ కార్యకర్తలు, హిందువుల ఆలయాలు, మనోభావాలను దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ధర్మస్థళ చలోకు వచ్చిన జనం చూస్తే భక్తులు ఏ స్థాయిలో ధర్మకేంద్రంపై విశ్వాసంతో ఉన్నారనేది తెలుస్తుందన్నారు. ఓ వ్యక్తి పుర్రె తీసుకుని వచ్చి వందలాది శవాలను పాతానంటే కనీసం అతడి పూర్వాపరాలు తెలుసుకోకుండానే సిట్ దర్యాప్తు ఎలా వేశారని ప్రశ్నించారు. రెండు నెలలుగా కొనసాగుతున్న చర్యలతో భక్తులలో ఆవేశం, ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటోందన్నారు. అయితే సమన్వయం కోసమే మౌనంగా ఉన్నారన్నారు. హిందూ సమాజం ఓపికను పరీక్షించరాదని హెచ్చరించారు. లెఫ్ట్‌భావాలు కల్గిన కొందరు కుట్ర పన్నారని స్వయంగా మంత్రి దినేశ్ గుండూరావు వ్యాఖ్యానించారని, డీసీఎం డీకే శివకుమార్ ఈ వివాదం వెనుక భారీ కుట్ర ఉందని బహిరంగంగా మాట్లాడారన్నారు. దీన్నిబట్టి ముఖ్యమంత్రి ఏ విధంగా నిర్ణయాలు తీసుకుంటారనేది తెలుస్తోందన్నారు. హిందూ వ్యతిరేక ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదన్నారు.

బీజేపీది రాజకీయ యాత్ర

● ఎన్ఐఏ దర్యాప్తు అవసరం లేదు: సీఎం



బీజేపీ చేపట్టిన చలో ధర్మసల రాజకీయ యాత్ర అని తద్వారా ఎలాంటి లాభం లేదని సీఎం సిద్దరామయ్య తెలిపారు. కేవలం వారు రాజకీయలబ్ధికోసమే యాత్ర చేశారన్నారు. సోమవారం మైసూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ధర్మసల, చాముండి కొండలు, దసరా ఉత్సవాల విషయంలో బీజేపీ బూటకపు నిరసన సాగిస్తోందన్నారు. హిందువులను ఆకర్షించుకోవాలని వారు ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే అది తప్పు అని గుర్తిస్తారన్నారు. ధర్మస్థల పట్ల మాకు అపారమైన గౌరవం ఉందన్నారు. సిట్ ఏర్పాటు చేసినప్పుడు వ్యతిరేకించని బీజేపీ, ఇప్పుడు లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందన్నారు. తానూ ఓ హిందువేనని, మా పల్లెలో రామమందిరం నిర్మించలేదా అన్నారు. బాను ముస్తాక్ ఓ కన్నడ రచయిత్రి అని, అంతర్జాతీయస్థాయిలో గౌరవం పొందారని, ఆమెతో దసరా ఉత్సవాలు ప్రారంభించడంలో తప్పేముందన్నారు. చాముండి కొండలు హిందువుల ఆస్తి అనుకున్నా దసరా పండుగ నాడహబ్బ (రాష్ట్ర పండుగ) అని అందరూ కలసి జరుపుకొనే వేడుక అన్నారు.

మైనారిటీల కోసమే..: కేంద్రమంత్రి జోషి

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా మైనారిటీలకు వత్తాసు పలికేలా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. అది వారి రక్తంలోనుంచి వచ్చిన విధానమన్నారు. ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్థాన్ సందేహాలను ఇక్కడి కాంగ్రెస్ నాయకులు లేవనెత్తారన్నారు. పహల్గాం దాడికి మనసైన్యం చొరవ, ప్రధాని నరేంద్రమోదీ ధీరత్వానికి ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌ను గడగడలాడించిందన్నారు. పార్టీ వ్యవహారాల కో-ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇదో పుణ్యభూమి అని, ఓటుబ్యాంకోసం కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందన్నారు.



సౌజన్య కుటుంబీకులను పరామర్శిస్తున్న విజయేంద్ర బృందం

నాయకుల పరామర్శ

ధర్మస్థలలో కొన్నేళ్లకిందట హత్యకు గురైన సౌజన్య కుటుంబీకులను బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర పరామర్శించారు. సౌజన్య తల్లితో కాసేపు మాట్లాడారు. పార్టీ కార్యదర్శి, ఎంపీ బ్రిజేశ్‌చౌట, సునిల్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



ధర్మాధికారి వీరేంద్ర హెగ్డేతో బీజేపీ బృందం

సీఎం చుట్టూ అర్బన్ నక్సల్స్: అశోక్

ధర్మస్థల వివాదంలో పెద్ద తిమింగళాలు ఉన్నాయని, పుర్రె వెనుక కేరళ, తమిళనాడు, ఢిల్లీకి చెందినవారు ఉన్నారని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. ఓ వ్యక్తి పుర్రెతో వస్తే కనీసం అతడి పేరు తెలుసుకోకుండానే దర్యాప్తుకు ఆదేశించిన ఘనత కాంగ్రెస్‌దన్నారు. ముందురోజు ఓ వ్యక్తి ఆరోపణలు చేస్తే దర్యాప్తు సాధ్యమా..? అన్న ముఖ్యమంత్రి ఆ వెంటనే సిట్‌ను ఏర్పాటు వెనుక ఎంత ఒత్తిడి ఉందో తెలుస్తోందన్నారు. సిద్దరామయ్య చుట్టూ అర్బన్ నక్సల్స్ చేరారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు హిందువులు, ఆర్ఎస్ఎస్, హిందూ ఆలయాలపైనే టార్గెట్ అన్నారు. డీసీఎం డీకే శివకుమార్ చాముండి కొండలు హిందువుల ఆస్తి కాదంటారని, మరె వరిదో చెప్పగలరా..? అంటూ సవాల్ విసిరారు. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ పుర్రె మాయాజాలకుల వెనుక రాష్ట్రప్రభుత్వం ఉందని, ప్రజలంతా ధీటుగా ఎదుర్కోవాలన్నారు. పుర్రెగ్యాంగ్‌తో కలసి ధర్మస్థలకు చెడ్డపేరు తీసుకొచ్చేందుకు ప్రయత్నించి బోల్తా పడ్డారన్నారు. ఇప్పటికే కొన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, విదేశీ నిధు లు ఢిల్లీ, కేరళ, తమిళనాడు కుట్రలు తెలియాల ంటే ఎన్ఐఏ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎంలు సదానందగౌడ, జగదీశ్‌శెట్టర్, జాతీయ యువ మోర్చా అధ్యక్షుడు తేజస్విసూర్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



బహిరంగ సభలో పాల్గొన్న కార్యకర్తలు, భక్తులు



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సమస్యలపై గళమెత్తిన విద్యార్థులు

● అతిథి అధ్యాపకులను నియమించాలని ఆందోళన

8

పోటెత్తుతున్న తుంగభద్ర

● కంప్లి తాలూకాలో జలమయమైన పంటపొలాలు



కంప్లి కోటే వద్ద వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న తుంగభద్రమ్మ



బంతిపూలు కోస్తున్న రైతు

పూల రైతులకు పండుగే

7

● వరుస పండుగలతో పెరిగిన ధరలు.. లాభాలతో అన్నదాత హర్షం

చెరువులో పడి యువకుడి మృతి


బత్తా మహేశ్ (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన బత్తా మహేశ్(36) ఆదివారం నిమజ్జనానికి వెళ్లాడు. నిమజ్జనంలో ముఖంపై, శరీరంపై పడిన రంగులను శుభ్రంచేసుకోవడానికి సోమవారం ఉదయం ధర్మవరం మొదటి మరువ వద్దకు వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు చెరువు వద్ద రంగులు పోవడానికి కడుక్కొంటుండగా కాలు జారీ చెరువులో పడ్డాడు. చెరువులో నీటి బురదలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. చేపల పట్టడానికి వెళ్లిన వారికి మృతదేహం కనిపించడంతో డయల్ 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తన సిబ్బందితో చెరువు వద్దకు వెళ్లి అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు నిహాన్ ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు..


చిన్న పులికొండ (ఫైల్)

గుత్తిరూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిన్న పులికొండ (45) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిన్న పులికొండ గత నెల 24న నంద్యాల జిల్లా ప్యాపిలికి వెళ్లి ఇంటికి బైక్ వస్తుండగా ప్యాపిలి వద్ద బైక్‌ను బొలెరో వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ప్యాలిపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని గొర్రెల కాపరి..

కనగానపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట పుట్టకనుమ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక గొర్రెల కాపరి మృతి చెందగా.. మరో కాపరి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. కొండపల్లికి చెందిన బంగి నరసింహులు(50) సోమవారం తగరకుంటకు వెళ్లాడు. అక్కడి నుంచి కంబదూరు మండలం బాలవెంకటాపురం గ్రామానికి చెందిన గొర్రెల యజమాని ముత్యాలప్పతో కలసి.. కంబదూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. ఈ క్రమంలో భానుకోట వైపు నుంచి ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో నరసింహులు, ముత్యాలప్ప తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరసింహులు మృతిచెందగా, ముత్యాలప్పను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. నరసింహులుకు భార్య నారాయణమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలపై రైతుల ఆగ్రహం


దుకాణం వద్ద మొక్కజొన్న కంకులతో నిరసన తెలుపుతున్న రైతులు

తాడిపత్రి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీ రోడ్డులోని ఒక దుకాణంలో నకిలీ విత్తనాలు పంపిణీ చేశారని కడప జిల్లా ముద్దనూరు మండలం శెట్టివారిపల్లికి చెందిన రైతులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం తమ గ్రామానికి చెందిన 30 మంది రైతులు వచ్చి మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశామని తెలిపారు. అదును వచ్చినా మొక్కజొన్న కంకుల్లో విత్తనాలు రాకపోవడంతో యాజమానికి పలుసార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఎకరాకు 40 క్వింటాళ్లు మొక్కజొన్న పంట పండుతుందని నమ్మకంతో ఇక్కడికి వచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తే.. కనీసం ఎకరాకు ఐదుక్వింటాళ్లు కూడా పండే పరిస్థితి లేదని వాపోయారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని, తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రూ.32 కోట్లతో పంచాయతీ భవనాల నిర్మాణం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలుచోట్ల పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆర్‌జీఎస్‌ఎ (రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్) కింద రూ.25 కోట్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మరో రూ.7 కోట్లు కేటాయించే విధంగా అంచనాలు తయారు చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు. ఇప్పటికే జిల్లాలో 27 పంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టేలా జాబితా తయారు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నూతన ఎస్‌ఈగా చిన్న సుబ్బరాయుడు బాధ్యతలు చేపడుతుండటంతో.. ఇంజనీర్లు మొత్తం సమావేశమయ్యే అవకాశం ఉంది. అందులో భాగంగా దీనిపై సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో జిల్లాలోని పలు పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాణం చేపట్టనున్నారు.

బాలికపై అత్యాచారం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలికపై నరేష్ అనే యువకుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి వెనుక వైపున ఉన్న బాలిక ముఖంపై నరేష్ చున్నీతో చుట్టివేసి, అరవకుండా గట్టిగా నోట్లో గుడ్డ కుక్కాడు. ఆ తరువాత బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కోసం తల్లిదండ్రులు వెతుకుతుండగా గమనించిన నరేష్ పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నరేష్‌పై పోక్సో, అత్యాచారం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టూటౌన్ సీఐను సస్పెండ్ చేయాలి

48 గంటలు న్యాయవాదుల విధుల బహిష్కరణ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): న్యాయవాదితో దురుసుగా ప్రవర్తించిన, దాడి చేసిన టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను సస్పెండ్ చేయాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. గతనెల 29న న్యాయవాది సాయి ప్రసాద్‌తో సీఐ దురుసుగా ప్రవర్తించడంపై సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, ప్రధానకార్యదర్శి వెంకట్రాముడు, ఇతర న్యాయవాదులు నిరసనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది సాయి ప్రసాద్ ఎలాంటి నేరం చేయకుండానే, గత నెల 29వ తేదీ ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద ఒక నేరస్తుడితో వ్యవహరించినట్టు సీఐ దురుసుగా మాట్లాడారన్నారు. అంతేకాకుండా బలవంతంగా స్టేషన్‌కు తరలించాడన్నారు. న్యాయవాదిలో అమానుషంగా ప్రవర్తించిన సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. లేకుంటే ప్రైవేట్ కేసు వేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. రెండు రోజులపాటు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్టు తీర్మానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, నరసింహులు, ధర్మసింగ్, బీమన్న, నల్లప్ప, గోవిందరాజులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డీఎస్సీలో నకిలీల కలకలం..!

- వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం
- ఈడబ్ల్యూఎస్ కోటాలో బోగస్ పత్రాలు
- ఆధారాలతో ఫిర్యాదులు
- అక్రమార్కులకు రెవెన్యూ అండ
- ఆందోళనలో అర్హులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాలలో నకిలీలు చొరబడినట్లు పెద్దఎత్తున విమర్శలు రావడంతో కలకలం రేగుతోంది. నకిలీల మోసాలపై అర్హులైన అభ్యర్థులు అధికారులకు ఆధారాలతో ఫిర్యాదులు చేస్తుండడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. ప్రధానంగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్) ఓసీ కుటుంబాలకు ఈ కోటాకింద ఉద్యోగాలు ఇస్తారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలో అధికంగా బోగస్‌వి పుట్టించుకున్నారు. రెవెన్యూ శాఖలో కొందరు అమ్యామాలకు పాల్పడి, మరికొందరు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల మేరకు కుటుంబానికి ఐదెకరాలు మెట్ట భూమి ఉంటేనే అర్హులు. కానీ రెవెన్యూ యంత్రాంగం మాయాజాలం చూపించి అధికభూములు ఉన్నా లేవని ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీచేస్తోందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఆరోపణల్లో కొన్ని..

తాడిపత్రి పట్టణానికి చెందిన ఓ అభ్యర్థి డీఎస్సీలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టుకు ఎంపికయ్యాడు. ఈయనది కడప జిల్లా కొండాపురం మండలం. తాడిపత్రిలో నివాసముంటూ ఇక్కడే చదివి లోకల్‌గా ఇప్పుడు పోస్టు దక్కించుకున్నాడు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇతడి తండ్రి(లేట్)పేరు మీద 8.67 ఎకరాలు, తల్లి పేరు మీద 2.66 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ అభ్యర్థికి తాడిపత్రి రెవెన్యూ అధికారులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను జారీ చేశారని ఆధారాలతో బయటపెట్టారు. శెట్టూరు మండలానికి చెందిన ఓ అభ్యర్థి కూడా డీఎస్సీలో పీడీగా ఎంపికయ్యాడు. ఈయన ఈడబ్ల్యూఎస్ కోటా కిందనే ఎంపిక కావడం వివాదం రేపుతోంది. అభ్యర్థి పేరుమీద మూడు ఎకరాలు, ఆయన తండ్రి పేరు మీద ఆరు ఎకరాలు, అన్న పేరు మీద 3.58 ఎకరాలు భూములు ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేలో వీరందరూ ఉమ్మడి కుటుంబంగా చూపుతోంది. కానీ ఈ అభ్యర్థికి రెవెన్యూ అధికారులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. కదిరి ప్రాంతంలో ఓ అభ్యర్థి పీహెచ్ కింద సదరం సర్టిఫికెట్‌తో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ పొందుతూ వచ్చారట. డీఎస్సీలో దరఖాస్తు చేసుకొని పీడీ (ఫిజికల్ డైరెక్టర్) పోస్టు కొట్టారట. డీఎస్సీ నిబంధనల మేరకు పీహెచ్‌లు పీడీ పోస్టులకు అనర్హులు. అయినా ఇన్నేళ్లు పీహెచ్ సదరం సర్టిఫికెట్‌తో పింఛన్ తీసుకుంటూ ఇపుడు డీఎస్సీలో సాధారణ వ్యక్తిగా ఉద్యోగం పొందడంపై తీవ్రచర్చసాగుతోంది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇతర మెడికల్ సర్టిఫికెట్లపైనా ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమార్కులకు రెవెన్యూ సహకారం

ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలనే ఆశతో అభ్యర్థులు అడ్డదారుల తొక్కుతున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకారం అందిస్తున్నారు. ఇందుకు తాడిపత్రి అభ్యర్థి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెటే నిలువెత్తు నిదర్శనం. ఈ అభ్యర్థి తండ్రి చనిపోయాడు. ఆయన ఒకడే కొడుకు, తల్లితో కలిసి ఉంటున్నాడు. కొండాపురం మండలంలో తండ్రికి 8.67 ఎకరాలు, తల్లికి 2.66 ఎకరాల భూమి ఉంది. తాడిపత్రిలో నివాసం ఉంటూ ఇక్కడ తమకు భూమిలేదని చూపించుకున్నారు. 1-బీ అడంగల్‌లోను, ఈసీ కోరగా అందులోను ఈ భూములు ఉన్నట్లు రికార్డుల్లో కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులకు డబ్బులు ముట్టచెప్పి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందుతున్నారని తెలుస్తోంది. వీటి వల్ల నష్టపోతున్న బాధిత అభ్యర్థులు నకిలీ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై ఆధారాలు సేకరించారు. ఈ మేరకు సోమవారం బాధిత అభ్యర్థులు కలెక్టరు వినోద్‌కుమార్, డీఈఓ ప్రసాద్‌బాబును వేర్వేరుగా కలిసి ఆధారాలతో ఫిర్యాదులు ఇచ్చారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న తాడిపత్రి అభ్యర్థి సైతం డీఈఓను కలిసి తమకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇదిగో అంటూ అందజేసి వెళ్లాడు. డీఎస్సీలో నకిలీల వ్యవహారాలు బయట పడుతుండడంతో ఇటు అధికారులు, అటు అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జాబితా మొత్తం రాష్ట్రశాఖనే ఎంపికచేస్తోందని, తమ చేతుల్లో ఏమీ లేదంటూ జిల్లా విద్యాశాఖ నిస్సహాయతను వ్యక్తం చేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి బోగస్‌లపై చర్యలు తీసుకుని నిజమైన ప్రతిభ అభ్యర్థులకు పోస్టులు దక్కేలా చూడాలని అభ్యర్థులు, వారికుటుంబసభ్యులు విన్నవించుకుంటున్నారు.


వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

ఫిర్యాదులు వాస్తవమే



డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలపై పలు ఫిర్యాదులు వస్తున్న విషయం వాస్తవమే. కొందరు బాధిత అభ్యర్థులు ఆధారాలతో సహా తీసుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. వాటన్నింటిని తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. ప్రత్యేక అధికారులను ఏర్పా టు చేసి ఈ సర్టిఫికెట్లపై విచారణ చేయిస్తాం. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ఆ 50 మందికి నిరాశే..

విడుదలకాని డీఎస్సీ అభ్యర్థుల జాబితా

5న తుది జాబితా అంటున్న రాష్ట్రశాఖ

అనంతపురం విద్య(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చెలగాటమాడుతున్నారు. మెరిట్ లిస్టు ఇచ్చి సెలెక్షన్ జాబితా పూర్తి స్థాయిలో విడుదల చేయడంలేదు. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు అభ్యర్థుల సెలెక్షన్ జాబితా ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికి రెండు విడతలలో 757 మంది పేర్లు విడుదల చేసి వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. మిగిలిన 50 మంది సెలెక్షన్ అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటిస్తామని, మెసేజ్‌లు వస్తాయని రాష్ట్ర శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు మెసేజ్‌లు, జాబితా కోసం ఎదురు చూశారు. సోమవారం మిగిలిన 50 మంది అభ్యర్థుల సెలెక్షన్ జాబితా విడుదల కాలేదు. ఎవరికీ మెసేజ్‌లు రాలేదు. రాత్రి పొద్దుపోయేవరకు కొందరు అభ్యర్థులు డీఈఓ కార్యాలయం వద్దే పడిగాపులు కాశారు. మరికొందరు ఫోన్లు చేస్తూ ఆరా తీశారు. జాబితా, మెసేజ్‌లు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశ చెందారు. ఇదిలా ఉండగా.. సోమవారం రాష్ట్ర అధికారులు డీఎస్సీ సెలెక్షన్ ఫైనల్ జాబితా ఈనెల 5న ప్రకటిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులకు కాన్ఫరెన్స్‌లో చెప్పారు. ఇప్పటి వరకు జాబితా రాలేదు, వెరిఫికేషన్ పెండింగ్ ఉంది, మరో వైపు వివిధ రకాల ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ జాబితా ఎలా విడుదల చేస్తారో అర్థంకావడంలేదు. దీంతో అభ్యర్థుల్లో మరింత టెన్షన్ మొదలైంది.

పూలకుంటలో అర్ధరాత్రి చోరీ

6 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీ

గుమ్మఘట్ట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామ శివారులో ఆదివారం అర్ధరాత్రి రైతు గంగిరెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి ఆరుతులాల బంగారం, రూ. రెండు లక్షల నగదు దోచుకెళ్లారు. గ్రామ శివారులో గంగిరెడ్డి, ఉషారాణి దంపతుల ఇల్లు ఉండగా దొంగలు అర్ధరాత్రి చొరబడి బీరువా పగులగొట్టి అందులోని ఉంగరం, కమ్మలు, ఒక చైనుతో పాటు ఆమె మెడలో మూడు తులాల మంగళసూత్రం సైతం తెంచుకొని పరారయ్యారు. ఇందుకు సంబంధించి గంగిరెడ్డి, ఉషారాణి దంపతులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ఉషారాణి ఇంట్లో నిద్రిస్తుండగా.. భర్త గంగిరెడ్డి ఇంటి బయట తలుపులు అడ్డం పెట్టుకొని మంచంపై నిద్రిస్తున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి ఉషారాణి గొంతులో మంగళసూత్రం తెంచుతుండగా మెలకువ వచ్చి కేకలు వేయగా ఇద్దరు దొంగలు పారిపోయినట్లు చెప్పారు. ఇంట్లో బీరువా తెరుచుకొని ఉందని, అందులో బంగారు కమ్మలు, ఉంగరం, చైనుతో పాటు కుమారుడి పెళ్లి కోసం దాచి ఉంచిన రూ. రెండు లక్షల నగదు కనిపించలేదని పోలీసులకు వివరించారు. ఘటనపై రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్యతో పాటు వివిధ మండలాలకు చెందిన ఎస్ఐలు, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌ను రప్పించి విస్తృత తనిఖీలు చేపట్టారు. దొంగలు వినియోగించిన పాత ద్విచక్రవాహనం గ్రామశివారులో వదిలి పరారైనట్లు డాగ్‌స్క్వాడ్ ద్వారా గుర్తించారు. బండి రికార్డుల ఆధారంగా రంగసముద్రం గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన వాహనంగా తెలిసింది. పొలం వద్ద వదిలిన వాహనాన్ని దొంగలు చోరీకి వినియోగించినట్లు రైతు పోలీసులకు తెలిపారు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.


వివరాలు ఆరాతీస్తున్న సీఐ

రూ.3 కోట్లు వృథా..!

జగనన్న లేఅవుట్‌లో ప్రజాధనం కుమ్మరింత

కోట్ల రూపాయలతో పనులు

భూమి అనువైంది కాదని ముందుకురాని లబ్ధిదారులు

ఇళ్లు కట్టుకునేందుకు ససేమిరా


లేఅవుట్‌లో నాటిన హద్దుల రాళ్లు


లేఅవుట్‌లో రోడ్లకు వేసిన ఎర్రమట్టిని తీసుకెళ్లిన దృశ్యం

అనంతపురంరూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రూపాయి ఖర్చు చేయాలంటే.. ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. అధికారులైతే మరింతగా లెక్కలు వేసి ఖర్చు చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాత్రం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కామారుపల్లి సమీపంలో జగనన్న లేఅవుట్‌లో నిధులు కుమ్మరించారు. అప్పటి పాలకుల మెప్పు కోసం.., కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికి కొందరు అధికారులు ప్రజాధనాన్ని మంచి నీళ్లలా ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు భూమి అనువైంది కదాని లబ్ధిదారులు అయిష్టత కనబరిచారు. చేసేదిలేక అప్పటి ప్రజాప్రతినిధులు సైతం లేఅవుట్ వద్దనేశారు. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది.

150 ఎకరాల్లో లేఅవుట్

గత ప్రభుత్వంలో కామారుపల్లి వద్ద జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేశారు. గ్రామ పరిధి సర్వే నంబర్లు 186, 187, 188,200,201 నుంచి 204, 214 నుంచి 217, 369లో 152.54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో లేఅవుట్ వేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అప్పటి పాలకులు, అధికారులు నిర్ణయించారు. ఇసుక, సవుడు భూమి కావడంతో ఇళ్ల నిర్మాణాలకు భూమి అనువైంది కాదన్న అభిప్రాయాలు అప్పట్లోనే వినిపించాయి. అప్పటి ఉన్నతాధికారులు కేవలం ప్రజాప్రతినిధుల మెప్పుకోసం హడావుడిగా పనులు చేశారు. అనంతపురం నగరంతోపాటు మండలంలోని కొన్ని ప్రాంతాల లబ్ధిదారులకు 7,308 ప్లాట్లు కేటాయించారు. ఆ మేరకు పట్టాల పంపిణీ పెద్ద ఎత్తున చేపట్టారు. లబ్ధిదారులు వచ్చి తమకు కేటాయించిన స్థలాలను చూసుకున్నారు. ఇళ్ల నిర్మాణం సాధ్యం కాదనీ, ఒక వేళ చేపట్టినా ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పునాదులకు కూడా సరిపోదని తెలియడంతో లబ్ధిదారులు స్థలాలు వద్దనేశారు. ప్రజాప్రతినిధులు చేసేదిలేక లబ్ధిదారులకు ఓటేశారు.

కోట్లు ఖర్చు..

లేఅవుట్ ఏర్పాటుకు అప్పటి అధికారులు ప్రజాధనాన్ని కోట్లలో ఖర్చు చేశారు. లేఅవుట్‌లో ఎర్రమట్టితో రోడ్ల ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం కింద రూ.80 లక్షలకు పైగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగ, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ.50 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. 150 ఎకరాలు చదును చేయడానికి, ప్లాట్ల విభజనకు, హద్దు రాళ్లు నాటేందుకు, ఇతరత్రా వాటికి రూ.కోటికిపైగానే వెచ్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా రూ.3కోట్ల మేర ప్రజాధనాన్ని లేఅవుట్ కోసం వినియోగించారు. ఇంకా నగరంలో నుంచి లేఅవుట్‌కు రావడానికి వందల రుపాయాలు లబ్ధిదారుల ఖర్చయింది.

వైసీపీ నాయకులకే లబ్ధి..

లేఅవుట్‌తో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ఇందులో లాభపడింది కాంట్రాక్టరే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో కాంట్రాక్టును వైసీపీ నాయకులే దక్కించుకుని లాభపడ్డారు. ఇటీవల మరో వైసీపీ నాయకుడు లేఅవుట్‌లోని మట్టిని తరలించి, జేబులు నింపుకున్నాడు. లేఅవుట్‌లో ఉపాధి హామీ పథకం కింద ఎర్రమట్టిని తోలి, రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ రోడ్లను పెకలించి, మట్టి తరలించి సొమ్ము చేసుకున్నాడు. ఇది చూసిన జనం ముక్కున వేలేసుకున్నారు. గత ప్రభుత్వంలో లేఅవుట్ కాంట్రాక్టు దక్కించుకుని బాగుపడితే.. ఇప్పుడు కూడా అదే పార్టీకి చెందిన మరో నాయకుడు రోడ్లకు తోలిన మట్టిని అమ్ముకుని లాభపడుతున్నాడంటూ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

డైరెక్టర్, కమిషన్ సభ్యులుగా నియామకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు నాయకులకు డైరెక్టర్ పోస్టులు దక్కాయి. సోమవారం టీడీపీ అధిష్టానం పలువురికి డైరెక్టర్ పోస్టులను ప్రకటించింది. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాలలోకేష్ యాదవ్‌ను నియమించారు. కళ్యాణదుర్గం మండలానికి చెందిన ఓబుళాపురం బాల లోకేష్ యాదవ్‌కు ఈ అవకాశం కల్పించారు. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏపీ స్టేట్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులుగా శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన సాకే అనిల్‌కుమార్‌ను ప్రకటించారు. ఆయన 2009 నుంచి టీడీపీలో పనిచేస్తున్నారు. 2021 నుంచి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఎస్టీ కమిషన్ సభ్యులుగా ప్రకటించడంతో ఆనందం వ్యక్తం చేశారు.



మంత్రి నారా లోకేశ్‌తో బాలలోకేశ్ యాదవ్, అనిల్‌కుమార్

అన్నదాతలను మింగిన అప్పులు

వేర్వేరుచోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య


మండ్లి నాగేంద్ర (ఫైల్)

ధర్మవరంరూరల్/తాడిమర్రి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను అప్పులు మింగేశాయి. ఉమ్మడి అనంత జిల్లాలో వేర్వేరుచోట్ల ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ధర్మవరం మండలం ఆర్.యర్రగుంటపల్లికి చెందిన రైతు మండ్లి నాగేంద్ర (45) సోమవారం రాత్రి విషం తాగి మరణించాడు. రూరల్ పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు నాగేంద్ర తనకున్న ఐదెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. పొలంలో బోరు తవ్వించడానికి, వేరుశనగ, కాయగూరల పంటల సాగుకోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. పంటలు పండక, అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో కుటుంబీకులు లేని సమయంలో విషం తాగి, అపస్మారక స్థితిలో పడిపోయాడు. కాసేపటికి గమనించిన స్థానికులు హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నాగేంద్రకు భార్య బొజ్జమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

దాడితోటలో కౌలు రైతు..


తలారి రాజగోపాల్ (ఫైల్)

తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన కౌలు రైతు తలారి రాజగోపాల్(37) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కృష్ణవేణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజగోపాల్ గ్రామానికి చెందిన రైతుల భూమిని కౌలుకు తీసుకుని, అరటి సాగు చేశాడు. పంటలు సరిగా పండక అప్పుల పాలయ్యాడు. మరిన్ని అప్పులు చేసి గొర్రెల పెంపకం చేపట్టాడు. అందులో కూడా నష్టాలే ఎదురయ్యాయి. దీంతో అప్పులు రూ.6లక్షలు దాటాయి. వాటిని తీర్చే మార్గం కనిపించక ఆదివారం సాయంత్రం తాను కౌలు చేస్తున్న అరటి తోటలోనే పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులకు తోటకెళ్లారు. అక్కడ విగతజీవిగా పడివున్న రాజగోపాల్‌ను చూసి, బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. రైతుకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సూపర్ సిక్స్... సూపర్ హిట్!

అనంతపురం క్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 15 నెలల్లోనే సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ అయ్యేలా చేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈనెల 10న సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో అనంతలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 3.50 లక్షల మంది ప్రజలు కలుస్తారని, ఇందులో ఏకంగా లక్ష మంది మహిళలే ఉంటారని ఆయన స్పష్టం చేశారు. అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఉమ్మడి జిల్లా పార్టీ పరిశీలకుడు కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జనసేన, బీజేపీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎం పదవి చేపట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులు, ప్రజల తరపున సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత ఈనెల 10వ తేదీ 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బహిరంగ సభ నిర్వహణ స్థలం ఎంపిక, ఏర్పాట్లు తదితర అంశాలపై గంటన్నరపాటు చర్చించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్‌గా అమలు చేశామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సాగిందన్నారు. ఇప్పుడిప్పుడే ఏపీ కోలుకుంటోందన్నారు. రాష్ట్రంలో గణనీయమైన మార్పు మొదలైందన్నారు. లా అండ్ ఆర్డర్ అద్భుతంగా అమలవుతోందన్నారు. అన్నివర్గాల ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నారన్నారు. తమకు నచ్చిన పని చేసుకుని బతుకుతున్నారన్నారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈనెల 10వ తేదీ అనంతపురంలో సూపర్ సిక్స్-సూపర్‌హిట్ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. నగర పరిధి జీఎంఆర్ ఇంద్రప్రస్థ స్థలంలో సభ నిర్వహించేలా ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయానికి వచ్చామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య సభ ఉంటుందన్నారు. పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్నారు. అందరూ సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు కూడా..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు అద్భుతంగా అమలవుతున్నాయన్నారు. వైసీపీ అనవసరంగా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు అందరికీ పథకాలు అమలవుతున్నాయన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనసేన నాయకుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ... ఏపీలో సూపర్ సిక్స్ పథకాలు చక్కగా అమలు చేస్తున్నారన్నారు. సభకు తమ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం హాజరవుతారని తెలిపారు. తర్వాత కొత్తగా అనంతపురం జిల్లాకు మంజూరైన అంబులెన్స్‌ను మంత్రులు టీజీ భరత్, పయ్యావుల కేశవ్, సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నందమూరి హరికృష్ణ (జయంతి)



నందమూరి హరికృష్ణ 1956 సెప్టెంబరు 2న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించారు. రాజకీయ నాయకుడిగా ఎమ్మెల్యే గా, రాజ్యసభ సభ్యుడిగా, మంత్రి గా వ్యవహరించారు. తండ్రి రామారావు తెలుగుదేశం పార్టీ ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలో పర్యటించే వేళ చైతన్య రథానికి సారథ్యం వహించాడు. తొలినాళ్లలో సినిమాల్లో నటించినా తర్వాత తండ్రితో రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. శ్రీరాములయ్య, శివరామరాజు, సీతయ్య, లాహిరి లాహిరి లాహిరి తదితర సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. ఉత్తమ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. 61వ యేట 2018 ఆగస్టు 29న రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు.

పవన్ కల్యాణ్ (పుట్టినరోజు)



పిఠాపురం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా కొనసాగుతున్న కొణిదెల పవన్ కల్యాణ్ 1971 సెప్టెంబరు 2న బాపట్లలో జన్మించారు. తెలుగు సినీ నటుడు, నిర్మాత, దర్శకుడిగానే కాక జనసేన పార్టీ వ్యవస్థాపకుడు. స్టంట్ కో-ఆర్డినేటర్, ప్లేబ్యాక్ సింగర్, కొరియోగ్రాఫర్‌గా విభిన్నంగా తన ప్రతిభను చాటుకున్నారు. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమాతో తెరంగేట్రం చేశారు. తొలిప్రేమ సినిమాకు ఉత్తమ సినిమాగా జాతీయ ఫిలిం పురస్కారం అందుకుంది. అభిమానులు పవర్‌స్టార్‌గా పిలుస్తారు. సుస్వాగతం, తమ్ముడు, బద్రి, ఖుషి, జల్సా, గబ్బర్ సింగ్, అత్తారింటికి దారేది, భీమ్లానాయక్ సినిమాలు హిట్‌గా నిలిచాయి. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం కల్గిన ఆయనకు కరాటేలో బ్లాక్‌బెల్ట్ ఉంది. అన్న చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా ఉన్నా కాలక్రమంలో కాంగ్రెస్‌లో విలీనమైంది. 2014లో సొంతంగా జనసేనను ఏర్పాటు చేశారు. కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ అనే ట్రస్టు సామాజికసేవా కార్యక్రమాలు అందిస్తున్నారు.

పూల రైతుకు పండుగే

బాగేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో వాణిజ్యపూల సాగుతో రైతులు ఆర్థికంగా లాభాలు పొందుతున్నారు. తాలూకాలో నదులు, కాలువలు లేక పోవడంతో ప్రధానంగా పాడిరంగంపై ఆధారపడ్డారు. ఇటీవల కొంత కాలంగా పూలసాగుపై దృష్టి సారించి అందులోనూ రాణిస్తున్నారు. బటన్ రోజా, చెండుమల్లి, చేమంతి వంటి పూలసాగుతో ఆర్థికంగా బలోపేతం అవుతు న్నారు. నైరుతి, ఈశాన్య రుతుపవనాలు, వాయుగుండం కారణంగా వర్షాలు ఒక మోస్తరుగా కురుస్తుండడంతో సాగు, కూరగాయల పంటల ద్వారా నష్టాలు ఎదుర్కొన్నారు. ఈ తరుణంలో డ్రిప్ ఇరిగేషన్ విధానం, బోర్ల ద్వారా పూల పెంపకం చేపట్టారు. తాలూకాలోని యల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధి లోని కంబాలపల్లి, పత్రవారిపల్లి, యల్లంపల్లి, లఘుమద్దేపల్లి, ఆచేపల్లి, టెంకాయిమాకలపల్లి, శంఖంవారిపల్లి, కానగమాకలపల్లి పంచాయతీలోని కోడిపల్లి, కొత్తపేట, నల్లమల్లేపల్లి సహా పలు గ్రామాలలో బటన్‌రోజా, చెండుమల్లి, కనకాంబరం, గుండుమల్లె, చేమంతిలతోపా పలు రకాల పూలు సాగు చేస్తున్నారు. శ్రావణమాసం వరమహాలక్ష్మి, ప్రస్తుతం వినాయక చవితి పండు గలు, ఇతర శుభ కార్యక్రమాలతో పూలకు డిమాండ్ ఉంది. అందుకు తగిన ట్టుగానే మార్కెట్‌లలో మంచి ధర పలుకుతుండడంతో లాభదాయకంగా ఉందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తోటలశాఖ ప్రకారం 2025-26లో ఇంతవరకు చేమంతి 202 హెక్టార్లలో 2012 టన్నులు, చెండుమల్లి 134 హెక్టార్లలో 1074 టన్నులు, బటన్ గులాబి ఒక హెక్టారులో 8 టన్నులు, సుగంధరాజ 2 హెక్టార్లలో 19 టన్నుల ఉత్పాదన లక్ష్యంగా ఉంది. పూలతోటల వద్దకే కొంతమంది వ్యాపారులు వచ్చి టోకుగా కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది. కాగా యల్లంపల్లికి చెందిన రైతు ఆనంద పట్టవారిపల్లికి వెళ్లే మార్గంలో 3 ఎకరాలలో చెండుమల్లి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కోతదశలో ఉండడంతో కూలీలు అందులో నిమగ్నమయ్యారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

- శక్తినగర్ వద్ద ప్రమాదం
- మృతదేహంతో గ్రామస్థుల నిరసన



ఆర్టీపీఎస్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది, కాలనీవాసులు

రాయచూరు సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శక్తినగర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఆవిరి బూడిద తీసుకెళుతున్న టిప్పర్ ఒకటి సోమవారం ఢీకొన్న సంఘటనలో బైక్ పై వెళుతున్న వ్యక్తి మృత్యువాత పడ్డాడు. శక్తినగర్ లేబర్ కాలనీకిరి చెందిన ఆటో డ్రైవర్ సురేశ్ అలియాస్ సింహాద్రి (35) తన బైక్ పై వెళుతుండగా ఆర్‌టీపీఎస్ పరిసరాల్లో నుంచి వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళుతున్న టిప్పర్ తాకిడికి బైక్ పై వెళుతున్న యువకుడు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. కాగా ప్రతి రోజు శక్తినగర్ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వందలాదిగా ఆవిరి బూడిద లారీలు విచ్చలవిడిగా తరలి వెళుతున్నాయని దీంతో పాటు రోడ్డు పక్కన వరుసగా వాహనాలు నిలిపి ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు అదే మార్గంలో కృష్ణా నది అక్రమంగా కొన్ని టిప్పర్‌లు ఇసుకను తరలిస్తున్నాయని ఆరోపించారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మౌన ప్రేక్షకుల్లా ఉండడం వల్లే ప్రమాదాల బారిన పడుతున్నామంటు స్థానిక వ్యాపారులు కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వీటికి అడ్డుకట్ట వేయాలని కోరారు. కాగా శక్తినగర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పరిమితికి మించి ఆవిరి బూడిదిని రవాణా చేస్తున్న వాహనాలను సరిగ్గా తనిఖీ చేయడం లేదంటు పలువురు యువకులు ఆరోపించారు.

ఉత్తమ జీవనానికి విద్యతోపాటు సంపద కీలకం

- మెల్‌బోర్న్ వర్సిటీ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ బయ్యా
- ఘనంగా పీఈఎస్ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పట్టాలు అందజేస్తున్న పీఈఎస్ చాన్స్‌లర్ జవహర్

బెంగళూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఉత్తమ జీవనానికి విద్యతోపాటు సంపద కీలకమని యువత చదువుకునే వేళ నైపుణ్యతలో రాణించి మంచి ఉద్యోగాలు లేదా పరిశోధనలలో సంపదను సృష్టించుకోవాలని ఆస్ట్రేలియా దేశం మెల్‌బోర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ బయ్యా అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీ పదో స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రాజ్‌కుమార్ బయ్యా మాట్లాడుతూ తపస్సు ద్వారా జీవనం ఎలా కొత్తశక్తిని ఇస్తుందో అదే తరహాలోనే విద్య అనే ఆయుధంతో యువత కొత్తశక్తిని పెంపొందించుకోవాలన్నారు. పలు భగవద్గీత శ్లోకాలను ప్రస్తావించిన ఆయన ఐన్‌స్టీన్, స్టీవ్‌జాబ్స్, మహాత్మాగాంధీ లాంటి వ్యక్తులు భగవద్గీత స్ఫూర్తిని పొందారన్నారు. భారత్ స్వదేశీ సూపర్ కంప్యూటర్ సాధనకు వ్యక్తిగతంగా సంతోషం అవుతోందన్నారు. చాన్స్‌లర్ జవహర్ మాట్లాడుతూ పట్టాలు పొందడం ఓ సాధన కాదని, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పీఈఎస్ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ దొరస్వామి నైతిక విలువలకు జీవితకాలం ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పరిశ్రమలో గుణాత్మకత, సేవ అనే సవాళ్లను ఎప్పటికీ వదులుకోరాదన్నారు. అంతిమంగా సేవ, జ్ఞానమే ఉత్తమ పౌరుడిగా ఎదిగేందుకు కారణమవుతుందన్నారు. వీసీ డాక్టర్ సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు. తొమ్మిదిమందికి పీహెచ్‌డీ, ఒకరికి ఎంటెక్ పరిశోధనా పురస్కారం, 1128 మందికి పీజీ, 4607మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలను పొందారు. పట్టాలు పొందినవారిలో 93మంది యూనివర్సిటీ ఉత్తమ ర్యాంకులు పొందారు. మొత్తం 553మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను దక్కించుకున్నారు. సీఓఓ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరించిన పంచాయతీ భవనం ప్రారంభం



భవనం ప్రారంభోత్సవంలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు

దొమ్మసంద్ర, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గ పరిధిలోని హాలనాయకనహళ్ళి గ్రామపంచాయతీలో ఆధునీకరించిన పంచాయతీ భవనాన్ని, డిజిటల్ గ్రంథాలయాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ రామాజిగౌడలు నూతన భవనాలను ప్రారంభించారు. సుమారు 40లక్షల రూపాయలతో ఆధునిక భవనం, డిజిటల్ లైబరీ, జన ఔషధి కేంద్రం ప్రారంభోత్సవానికి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సవితా బాబురెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రిని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా రిటైరైన పీడీఓ నరసింహరాజును సభ్యులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సీ వెంకటేశ్, మంజునాథ్, హెచ్‌ఎం గీతా, శ్వేతా సురేశ్, శివకుమార్, శోభా రమేశ్, అనిల్‌కుమార్, ఆర్ మంజునాథ్, సుకన్యా, హరిబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై జాగృతి



జాగృతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు

చింతామణి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): భారతీయ కృషి అనుదాన పరిషత్, వ్యవసాయ విజ్ఞాన కేంద్రం కురుబూరు ఆధ్వర్యంలో ఏ హొసహళ్ళి లోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు పౌష్టికాహారంపై జాగృతి కార్యక్రమం నిర్వహించారు. జాతీయ పౌష్టికాహార వారోత్సవంలో భాగంగా సోమవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సైంటిస్టు డాక్టర్ సౌమ్య హిరేగౌడర్‌లు మాట్లాడుతూ ఉత్తమ జీవనంకోసం సరైన ఆహారం తీసుకోవాలనే లక్ష్యంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. దైనందిన జీవనంలో ధాన్యం (బియ్యం, రాగి, గోధుమలు, జొన్న), పంటలు (కంది, పెసర), నూనెగింజలు (నువ్వులు, వేరుశనగ), కూరగాయలు, పండ్లు, పాల, పాల ఉత్పత్తులైన పెరుగు, వెన్న, నెయ్యివంటితోపాటు బెల్లం, మాంసాహారమైన చేపలు ఇతరత్రా వంటివి తగిన రీతిలో ఆరగించాలన్నారు. సమతుల్యమైన ఆహారంతోనే చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. సాంకేతిక అధికారి డాక్టర్ అరుణా మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం మానవుడి ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. టీచర్ ప్రశాంత మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనగుణంగా ఆహారపద్ధతి మారడంతో రోగనిరోధకశక్తి తక్కువ అవుతోందన్నారు. తద్వారా అనారోగ్యం సమస్యలు తలెత్తుతు న్నాయన్నారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువు తీసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణంలో చవితి వేడుకలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బంగారపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): బంగారపేట పట్టణంలోని మునియమ్మ లే అవుట్‌లో మహాగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో 29వ వార్షిక ఉత్సవాలు సందడిగా సాగాయి. 13 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని కొలువుదీర్చారు. ఐదురోజులపాటు ప్రతిరోజూ విశేషపూజలు, అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక ఉత్సవాలలో భాగంగా చివరిరోజు వీణా వెంకటేశ్ నేతృత్వంలో మహిళలకు రంగవల్లులు పోటీలు, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్నవారికి కన్సొలేషన్ బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు నంజేవాడెయర్, అంజన్, శివకుమార్, జీవన్‌బాబు, సంతోష్, విజయ్‌కుమార్, సెల్వం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఖాతా మేళా



అర్జీలు స్వీకరిస్తున్న ఉప తహసీల్దార్ సుబ్రమణి

ముళబాగిలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో రెవెన్యూ ఖాతాలను పరిష్కరించేలా ఈ-ఖాతా మేళా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి మృతి చెందినవారి నుంచి వారసుదారుల పేరిట రికార్డులు మార్చడానికి వీలు కల్పిస్తున్నారు. ఆస్తి వివరాలతోపాటు అర్జీ దారులు తగిన రికార్డులు సమర్పిస్తే 15రోజుల్లోగా పరిష్కరిస్తామని ఉపతహసీల్దార్ సుబ్రమణి తెలిపారు. తాలూకాలోని కాంతరాజ్ సర్కిల్‌లో సోమవారం ఏర్పాటైన మేళాలో కొత్తమంగళ, వీ గుట్టహళ్ళి రెవెన్యూ పరిధిలోని గ్రామాల ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈ-ఖాతా పొందేందుకు నాడకచేరి లేదా తాలూకా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. సరైన దాఖలాలతో అర్జీని సమర్పిస్తే వారసులకు 15రోజుల్లోగా ఈ-ఖాతా సాధ్యమవుతుందన్నారు. తాలూకాలోని 48 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలో మేళాలు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2న ఎమ్మెనత్త, 3న కన్నసంద్ర, 4న యళగొండహళ్ళి, 6న దేవరాయసముద్ర, 8న మేళాగాణి సర్కిల్‌లలో ఈ-ఖాతా మేళా ఉంటుందన్నారు. ప్రస్తుత శిబిరంలో విలేజ్ అకౌంటెంట్ తనుజ, విలేజ్ అసిస్టెంట్ రామకృష్ణ, గంగాధర్, చంద్రప్ప పాల్గొన్నారు.

పర్యావరణం

ఊరి చివర..
ఉత్సవం ముగిసిన చోట..
ఉపాధి కోసం పేదల వేట..!

ఒక్కందుకు కటిక పేదరికమూ
మంచిదే అంటారేమో..!
ఇది పొట్టకూటి కోసం
చేసే రణం కాదు..
పర్యావరణ హితం..
అని సుద్దులు చెబుతారేమో..!

దిక్కులేని వారికి
దేవుడే దిక్కు అంటే ఇదేనేమో..!
ఈ రూపంలో బొజ్జ గణపతి
ఈ పేదల పొట్ట నింపుతున్నాడేమో!

స్వామి..
నువ్వు మునిగిన నీట
వీరు మునుగుతున్నారు కదా..
ఇంక పేదరికపు శాపం నుంచి
విముక్తి కలిగించు..!

(అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి సమీపంలో..)

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఇదిగో.. వింటున్నావా.. టెంకాయ దొరికింది.. రేపు చట్నీ చేసుకుందాం



పనికొచ్చేవన్నీ ఏరుకుందాం.. అమ్మేసి పండుగ చేసుకుందాం..



చెత్త నుంచి సంపద సృష్టి.. ఇలా కూడా..!



గణపతి కరిగిన నీట.. గంగమ్మ కరుణకై వేట..!



సన్న బియ్యం ప్యాకెట్ తెచ్చుకుందాం.. బువ్వ ఇట్ల కమ్మగా ఉంటుంది..!

ఖాతాదారులకు అనుగుణంగా ఫోన్‌పే ఎస్‌బీఐ కార్డు

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో క్రెడిట్‌కార్డు పంపిణీలో అతిపెద్ద బ్యాంకర్‌గా పేరొందిన ఎస్‌బీఐ ఫోన్‌పే సహభాగత్వంతో ఫోన్‌పే ఎస్‌బీఐ కార్డును విడుదల చేసింది. ఈ కొత్త క్రెడిట్‌కార్డును బెంగళూరులో ఇటీవల విడుదల చేశారు. క్రెడిట్‌కార్డు ప్రతిరోజూ ఖర్చుపై రివార్డుల అనుభవాలను సమకూర్చనుంది. దేశంలో ఎక్కడైనా ఖాతాదారులు ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. క్రెడిట్‌కార్డు 2 వేరియంట్‌లలో ఉండనుందని ఫోన్‌పే ఎస్‌బీఐ కార్డు పర్పుల్, సెలెక్ట్ బ్లాక్ అనే రెండు విధానాలు ఉన్నాయన్నారు. రూపే, వీసా పేమెంట్‌ల నెట్‌వర్క్‌లోనూ లభ్యం కానుందన్నారు. తద్వారా ఖాతాదారులు అనువైన నెట్‌వర్క్‌లను ఎంపిక చేసుకునేందుకు వీలుండనుంది. ఈ కార్డు ద్వారా రోజువారీ కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులు, ట్రావెల్ బుక్కింగ్‌లు, యుటిలిటీ పేమెంట్‌లు, బీమా ప్రీమియం వంటి వాటికి వినియోగించడం ద్వారా పాయింట్‌లను పొందవచ్చు. అప్లికేషన్ ప్రక్రియ ఫోన్‌పే యాప్‌లోనే ఉంటుంది. ఎస్‌బీఐ కార్డ్స్ ఎండీ సలీలా పాండే అభిప్రాయం మేరకు డిజిటల్ ప్లాట్‌ఫాంలు సులభతరం చేసేందుకు ఫోన్‌పేతో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఫోన్‌పే కో-ఫౌండర్ సమీర్ నిగమ్ అభిప్రాయం మేరకు ఎస్‌బీఐతో ఒప్పందం ద్వారా డిజిటల్ పేమెంట్లతో సంబంధం లేకుండానే క్రెడిట్ రంగంలోకి వచ్చామన్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి

- డ్యాన్స్ చేస్తుండగా గుండెపోటుతో వ్యక్తి



లక్ష్మీపతి (ఫైల్)

శిడ్లఘట్ట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా శిడ్లఘట్ట తాలూకా బోదగూరు గ్రామంలో వినాయక చవితి నిమజ్జనం వేళ ఆదివారం అపశృతి చోటు చేసుకుంది. ఊరేగింపు వేళ యువత, స్థానికులు నృత్యాలు చేస్తూ సాగారు. ఈ సందర్భంగా 40ఏళ్ల లక్ష్మీపతి అనే వ్యక్తి నాగవల్లి పాటకు డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కూలబడ్డాడు. వెంటనే అతడిని శిడ్లఘట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే గుండెపోటు కారణంగా మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. లక్ష్మీపతికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మీపతి ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

15 ఏళ్ల బాలిక ప్రసవం

బెంగళూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదగిరి జిల్లా తొమ్మిదోతరగతి విద్యార్థిని రెసిడెన్షియల్ స్కూల్‌లోనే కాన్పు అయిన విషయం మరువక ముందే శివమొగ్గ జిల్లాలో అటువంటి సంఘటనే వెలుగులోకి వచ్చింది. మూడురోజుల కిందట ఇంట్లోనే రాత్రివేళ శౌచాలయంకు వెళ్ళిన బాలిక బిడ్డను ప్రసవించారు. వెంటనే తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని మెగ్గాన్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఏడున్నర నెలలకే ప్రసవం అయినట్లు గుర్తించిన వైద్యులు రెండురోజులు ఆసుపత్రిలోనే చికిత్సలు అందించారు. నవజాత శిశువు 1.800 కేజీల బరువు ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం తల్లీబిడ్డలను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. పేదకుటుంబానికి చెందిన తల్లిదండ్రులకు ముగ్గురు సంతానంగా ఉన్నారు. ప్రస్తుతం కాన్పు అయిన బాలిక తొమ్మిదో తరగతి దాకా చదివి ఈ ఏడాది పాఠశాలకు వెళ్ళలేదు. బాలిక కంటే పెద్దవాడైన 17 ఏళ్ళ సోదరుడే కిరాతకానికి పాల్పడినట్లు గుర్తించారు. ఇంట్లో తల్లిదండ్రులు కూలీపనులకు వెళ్ళినప్పుడు సోదరుడు దారుణానికి ఒడిగట్టేవారని ఎవరికైనా తెలిపితే చంపేస్తానని బెదిరించినట్లు తెలుస్తోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కుమారుడిపై పోక్సోకేసు నమోదు చేశారు. ఇటు వైద్యులు, పోలీసులు బాలిక పేరు వివరాలను రహస్యంగా ఉంచారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన బాలికను జిల్లా మహిళా సంరక్షణా కేంద్రానికి తరలించారు. మరో బాలికకు ఆరోగ్య సమస్య ఉన్నట్లు సమాచారం.

ఏడో తరగతి బాలికకు రెండునెలల గర్భం

- ఎనిమిదో తరగతి బాలుడిపై పోక్సో కేసు నమోదు

బెంగళూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిగ్గుచేటు అనిపించే సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. బాగల్‌కోటె జిల్లా ఇళకల్ గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడోతరగతి చదివే బాలిక రెండునెలల గర్భిణీగా నిర్ధారణ అయ్యింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు 8వతరగతి బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యుడి శశిధర్ కోసంబె తెలిపిన మేరకు బాలికకు ఇటీవల తరచుగా కడుపునొప్పి వస్తుండటంతో ఆసుపత్రికి తీసుకెళ్ళగా డాక్టర్‌లు నిర్ధారించారన్నారు. మైనరు అయినందున ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే బాగల్‌కోటె జిల్లా ఎస్పీతోను సమస్యను వివరించామన్నారు. ఇళకల్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దారుణానికి పాల్పడిన బాలుడిని బాలల న్యాయమండలి ముందు సోమవారం హాజరుపరిచి బాలల సంరక్షణా కేంద్రంకు తరలించినట్లు తెలిపారు.

ఇన్నోవేషన్ మారథాన్‌లో నమోదు కావాలి

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల తప్పనిసరిగా నమోదుకావాలని డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్‌సెంటర్ క్యూరేటర్ బాలమురళీ సోమవారం ఓ ప్రకటనలో ఆదేశాలు ఇచ్చారు. దీనిని కేంద్ర విద్యాశాఖ, సైన్స్ పరిశోధన సంస్థ సంయుక్తంగా పిల్లల్లో సైన్స్ పట్ల జిజ్ఞాస పెంచడానికి ఏర్పాటు చేశా యన్నారు. ఇందులో ప్రతి పాఠశాల మంగళవారంలోగా నమోదు కావాలని పేర్కొన్నారు. కనీసం 50 మంది విద్యార్థులను బృందంగా ఏర్పాటు చేసి ఆవిష్కరణలను తయారు చేయించాలని తెలిపారు. అనుమానాలు ఉంటే జిల్లా సైన్స్‌సెంటర్ క్యూరేటర్‌ను సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠ ధర రూ.14, సరాసరిధర రూ.19తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.18వేలు

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 668 టన్నులు వచ్చినట్లు పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.59	1,630.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	79.324	40,107
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	68,707	13,475
నీటి నిల్వ (టీఎంసీలు)	78.44	96.84

సామాజిక, విద్యా సర్వే పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న వెనుకబడిన తరగతుల సామాజిక, విద్యా సర్వేను పకడ్బందీగా చచేపట్టి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధికారులకు ఆదేశించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం కేశ్వన్ వీడియో హాల్లో వెనుకబడిన తరగతుల సామాజిక, విద్యా సర్వే కోసం వివిధ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఇప్పటికే విద్యుత్ మీటర్ రీడర్లను ఉపయోగించి అన్ని ఇళ్లను జియో-ట్యాగింగ్ చేయడం ద్వారా సామాజిక, విద్యాసర్వే యొక్క మెదటి దశను ప్రారంభించిందన్నారు. సర్వేలో ఏ ఒక్క ఇంటిని వదలకుండా చేపట్టాలన్నారు. రెండవ దశ సర్వే సెప్టెంబర్ 22నుంచి అక్టోబర్ 7వరకు చేపట్టాలన్నారు. సర్వే పనులకు ఎన్యూమరేటర్లను నియమించి జాబితాను ఖరారు చేయాలని సంబంధిత అధికారులు వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ద్వారా ఇళ్ల ఆర్ఆర్ నంబర్లను జియోట్యారింగ్ చేయడం ద్వారా జిల్లా 100శాతం పురోగతి సాదించాలన్నారు. జియోట్యాగింగ్ చేసిన ఇళ్లకు స్టిక్కర్లను అతికించాలని, సర్వేకు ముందు ఆర్ఆర్ నంబర్లను గుర్తించడంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 33,000 ఇళ్ల ఆర్ఆర్ నంబర్లను సర్వే చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. మెదటి దశసర్వేను చాలా చక్కగా ఎటువంటి లోపాలకు అస్కారం లేకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీని వల్ల రెండవ దశ సర్వేను క్రమబద్ధంగా ,శాస్త్రీయంగా,కచ్చితంగా అమలు చేయడానికి వీలు కలుగుతుందన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ 65ప్రశ్నాపత్రాలతో కూడిన ఎలక్ట్రానిక్ డెలీవరీ ఆఫ్ సివిల్ సర్వీసెస్ ద్వారా అభివృద్ధి చేయబడిన పద్ధతుల ద్వారా సర్వే చేపడుతోందన్నారు. చెత్త పారవేసే వాహనాల ద్వారా జింగిల్ ఆడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా సర్వేలో అధికారులకు సహకరించాలన్నారు.

ఆర్ఆర్ నంబర్లు లేకున్నా.. సర్వే తప్పనిసరి

సండూర్ తాలూకా పరిధిలోని జిందాల్ టౌన్‌షిప్‌లోని ఇళ్లకు ఆర్ఆర్ నంబర్లు ఇవ్వలేదు. ఆ పరిధిలోని గ్రామ పంచాయితీ అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి అన్ని ఇళ్లకు నెంబర్లు ఇవ్వాలని సండూర్ తహసీల్దార్ ఈఓలను ఆదేశించారు. సామాజిక విద్యా పరిస్థితుల దృష్ట్యా సర్వే పని ముఖ్యమైనది కాబట్టి ,జిల్లాలో 4లక్షల కుటుంబాలు ఉన్నాయని అంచనా. సర్వే పనిని క్రమపద్ధతిలో నిర్వహించడానికి 2,000 మందికిపైగా ఎన్యూమరేటర్లను కేటాయించాలన్నారు. ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్, ప్రతి 20మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్, జిల్లాకు 50మంది మాస్టర్ ట్రైనర్‌లను గుర్తించి శిక్షణ సంక్షేమ శాఖ,పాఠశాల విద్యాశాఖ, సీఆర్‌పీ, బీఆర్‌పీ, అర్బన్ డెవలప్‌మెంట్ సెల్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ప్రీ-యూనివర్శిటీ విద్యాశాఖ, జెస్కాం ఇందనశాఖ అధికారులు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. అందరికీ పథకాలు అందించడానికే సర్వే చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ హారీస్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ పీఎస్ మంజునాథ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప, జిల్లా గణాంక అధికారి పత్రిబసప్ప, వివిధ తాలూకాల తహసీల్దార్లు, ఈఓలు, పట్టణ స్థానిక సంస్థల ముఖ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వివిధ శాఖల అధికారులు

గ్రాంట్లను పూర్తిగా ఖర్చు చేయాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్ర, కేంద్ర పథకాల కింద వివిధ లక్ష్య ప్రాజెక్టుల కోసం జిల్లాలోని వివిధ శాఖలకు విడుదల చేసిన ఎస్సీఎస్పీ, టీఎస్పీ గ్రాంట్లను అధికారులు పూర్తిస్థాయిలో నిర్ణీత వ్యవధిలో ఖర్చు చేయాలని ఆదేశించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జూలై 2025 చివరి వరకు ఎస్సీ, ఎస్టీ, టీఎస్పీ కార్యక్రమాల శాఖలవారీగా ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉద్యానవన,పశు సంవర్ధక, మత్స్య, వ్యవసాయ, మహిళా శిశు అభివృద్ధి శాఖలతో సహా అనేక శాఖలు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని ఆయన అన్నారు. జిల్లా పట్టణాభివృద్ధి శాఖ వివిధ అభివృద్ధి పనుల అమలులో నెమ్మదిగా ఉందని పేర్కొంటూ ,సంబంధిత పట్టణ స్థానిక సంస్థల ముఖ్య అధికారులను అవసరమైన సమాచారాన్ని సమర్పించమనివ కోరుటూ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు. కొన్ని శాఖలు వివిధ పనులకు డబ్బు ఖర్చు చేసి పనులు చేశామని,కానీ బిల్లులు సమర్పించలేదని, బిల్లులను వంటనే సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా జిల్లాపంచాయతీ ముఖ్య కార్య నిర్వహణాధికారి మహ్మద్ హారీస్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్ప,జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్ బాబు, జిల్లాపారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్, వ్యవసాయం, ఉద్యానవన శాఆఖ, విద్యా శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన విద్యార్థులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐడీఎస్ఓ విద్యార్థి సంస్థ నాయకత్వంలో విద్యార్థులు, ఎస్‌జీఆర్‌సీఎం (సిటీ) ప్రభుత్వ వాణిజ్య డిగ్రీ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర కోశాధికారి సుభాష్ బీజీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ తరగతులు ప్రారంభమై నెల రోజులు అవుతున్నా గెస్ట్ లెక్చరర్లను నియమించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో అధ్యాపకుల కొరతతో తరగతులు ప్రారంభం కాలేదన్నారు. దీంతో విద్యార్థులకు ఆందోళన తప్పడం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని తక్షణమే నియామకాలు చేపట్టాలన్నారు. డిగ్రీ విద్యార్థుల మొదటి అంతర్గత పరీక్షలు వచ్చే నెలలో జరగనున్నాయని, కోర్టు ఉత్తర్వుల మేరకు అధ్యాపకుల నియామకాలు చేపట్టాలనానరు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు కే.ఈరన్న, విద్యార్థులు నరేంద్ర, భీమన్న, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పోటెత్తుతున్న తుంగభద్ర

కంప్లి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదికి నీరు ఎక్కువగా పోటు ఎత్తడం రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రతిసారి నదికి నీరు పోటెత్తడం వల్ల నదిఒడ్డున వుండే మోటార్లలో నీరు చేరుకుని మోటార్లు ధ్వంసమై రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నదికి గత రెండు మూడు రోజులుగా 80 వేలకుపైగా నీరు నదికి రావడంతో అధికారులు గంగావతి, కంప్లి మధ్య కోటే తుంగభద్ర వంతెన పై ఎప్పుడూ నిలబెడతారోనని ఆందోళన చెందుతున్నారు. ఈ యేడాది పలుసార్లు కోటే వద్ద వంతెనపై వాహనాలు బంద్ చేయడంతో చాలా వరకు ఇబ్బందులకు గురయ్యామని తెలిపారు. ప్రస్తుతానికి మాత్రం వంతెనపై రాకపోకలు బంద్ చేపట్టలేదు. ఏ సమయంలో నదికి నీరు ఎక్కువగా పోటెత్తుతాయోనని దిగులు చెందుతున్నారు.

వరికి తెగుళ్లు

కంప్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం, ఇటిగి, మన్నూరు, సూగూరు, చిక్కజాగనూరు, ఎమ్మిగనూరు, తదితర గ్రామాల్లో వరి పంట సాగుకు వైరస్ తెగుళ్ల సోకినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు హనుమప్ప మాట్లాడుతూ ఖరీఫ్ నది కింద మోటార్లు కింద ముందుగానే వేసుకున్న వరి పంటలు ఎరుపు రంగు వైరస్ తెగుళ్ల సోకినట్లు తెలిపారు. పంటలు రంగు మారడంతో పంట ఎదుగుదల తగ్గిపోయి రానున్న రోజుల్లో పంట దిగుబడులు తగ్గుతాయన్నారు. అనుభవ రైతులతోనే వ్యవసాయ శాఖాధికారులతో వరి పంటకు సోకిన తెగుళ్ల విషయంపైన చర్చించి ఎరువులు పిచికారి మందులు ఇతర పంటలకు చేపడుతున్నామని తెలిపారు. యేడాది వర్షాలు ఎక్కువగా వుండటంతో తెగుళ్ల సోకే ప్రభావం ఎక్కువగా వుంటుందని తెలిపారు. ముందుగానే అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టి అవగాహన కల్పించాలని కోరారు.



చిక్కజాగనూరు వద్ద వరి పంటకు సోకిన తెగుళ్లు

కల్యాణ కర్ణాటకపై వివక్ష సరికాదు

● కన్నడ నాడు రైతుసంఘం



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఏకీకరణ జరిగి 69సంవత్సరాలు గడిచినా సంక్షేమ కర్ణాటక పట్ల వివక్ష చూపుతున్నారని, విద్య, నీటిపారుదల, విద్యుత్, వ్యసాయం,రవాణా, రహదారి అభివృద్ధి, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని కన్నడ నాడు రైతు సంఘం జిల్లా యంత్రాంగానికి సోమవారం వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మెనసిన ఈశ్వరప్ప మాట్లాడుతూ కళ్యాణ కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారితో సహా ఏడు జిల్లాలు విద్యారంగం చాలా వెనుకబడి ఉందన్నారు. 63,71శాతం అక్షరాస్యతతో మన పాఠశాలలు, కళాశాలలు, భవనాలు, శీతలీకరణ వ్యవస్థలు శిథిలావస్థలో ఉన్నాయని, కొన్ని గ్రామాలకు భవనాలు లేవు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, కళాశాలల్లో ప్రొఫెసర్ల కొరత ఉందన్నారు. బీదర్‌లో బెంగళూరు వాతావరణం ఉంది, బీదర్ నుంచి హైదరాబాద్ దూరం 145కిలోమీటర్లు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. అయిన ఐటీ, బీటీ కంపెనీలు ఏర్పాటుకావడం లేదన్నారు. బళ్లారిలో రైతుల నుంచి భూమిని స్వాధీనం చేసుకున్నప్పటికీ, విమానాశ్రయం ఏర్పాటు కాలేదన్నారు. కళ్యాణ కర్ణాటక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కంప్లి అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే



కంప్లి కోట వద్ద రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ అన్నారు. సీఎం ప్రత్యేక నిధుల పథకం కింద సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో కంప్లి కోట తుంగభద్ర నది వంతెన నుంచి కొత్త బస్టాండ్ వరకు రోడ్డు చేపట్టిన పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మొరార్జీ దేశాయ్, వసతి పాఠశాల జీటీటీసీ స్కూలు ఏర్పాటవుతాయి పాత బస్టాండ్, నీటి పారుదల శాఖ కాంపౌండ్ వాల్‌ను తొలగించి ఈ ప్రాంతానికి సుందరంగా చేస్తామన్నారు. రోడ్డును అభివృద్ధి చేయడమే లక్ష్యం ప్రజా పనుల శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి ఇప్పటికే కంప్లిలో కొత్త వంతెన నిర్మాణ ఏర్పాటుకు చర్చించామన్నారు. ఇటీవల జరిగిన విధానసభ సమావేశంలో కూడా ఈ నూతన వంతెన నిర్మాణంపై చర్చించామన్నారు. నాబార్డ్ ప్రజా పనుల శాఖ నిధులతో కొత్త వంతెనను నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, మున్సిపల్ అధ్యక్షులు బట్ట ప్రసాద్, సభ్యులు కేఎస్ చాంద్ బాషా, సీఆర్ హనుమంత, లడ్డు వన్నూరు వలి, నామినేటెడ్ సభ్యులు మౌనేష్, ఏపీఎంసీ అధ్యక్షుడు హబీబ్ రెహమాన్, యువ మోర్చ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ నాయకులు చెన్నయ్యస్వామి, దానప్ప, సుధీర్, కే మనోహర్, యాల్పి అబ్దుల్ మునాఫ్, వి సత్యప్ప, ఆటో రఘు, రమేష్, నాగరాజు, వన్నూరప్ప, డిష్ ప్రసాద్, విరుపాక్షి, పరశురాం, ఖాజా, శశికుమార్ పాల్గొన్నారు.

రేపు సంచార జాతుల నిరసన



కరపత్రాలు విడుదల చేస్తున్న సంచారజాతుల నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్ర జ్యోతి): సంచార జాతుల వర్గాలకు ఒక శాతం అంతర్గత రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 3న బెంగళూరు చలో నిర్వహించనున్నట్లు తెలిపింది. సోమవారం విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకుడు శివకుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్లలో ప్రాధాన్యం ఇవ్వని వారికి న్యాయం జరిగేలా సుప్రీంకోర్టు అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. దీని ప్రకారం రాష్ట్రంలో ఆరు నెలల పాటు అధ్యయనం చేసిన నాగమోహన్ దాస్ నేతృత్వంలోని కమిషన్, సంచార జాతులకు 1శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసిందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును,నాగమోహన్‌దాస్ నివేదికను పట్టించుకోలేదన్నారు. సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. సిద్దరామయ్య 4న మంత్రివర్గ సమావేశంలో న్యాయమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. విద్యాపరంగా, సామాజికపరంగా అణచి వేతకు గురైన వెనుకబడిన తమకు అంతర్గత రిజర్వేషన్లకు ప్రత్యేక హక్కు ఉండాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే న్యాయపోరాటం చేపడ్తామన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

● గ్యారెంటీ కమిటీ అధ్యక్షుడు కరిబసప్ప



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కరిబసప్ప

సిరుగుప్ప, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్యారెంటీ కమిటీ అధ్యక్షుడు కరిబసప్ప సూచించారు. సోమవారం సిరుగుప్ప తాలూకాలోని దేశనూరు గ్రామంలో గ్యారెంటీ పథకాలల విజయవంతంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరిబసప్ప మాట్లాడుతూ గృహ లక్ష్మీ ఉచిత బస్సు సేవలు బీపీఎల్ లబ్దిదారులకు పది కిలోల బియ్యం, యువతకు ఉపాధి, పథకాలు ఎంతో విజయవంతంగా అమల్లోకి వచ్చాయన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యారెంటీ పథకాల కమిటీ సభ్యులు మారుతీ వరప్రసాద్‌రెడ్డి, నాగరాజు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● పురసభ అధ్యక్షుడు బట్టప్రసాద్



పోటీలను ప్రారంభిస్తున్న పురసభ అధ్యక్షుడు బట్టప్రసాద్

కంప్లి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పురసభ అధ్యక్షుడు బట్టప్రసాద్ సూచించారు. సోమవారం కంప్లిలో ప్రాథమిక పాఠశాలలో క్రీడాపోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గెలుపోటములు ఆశించకుండా క్రీడల్లో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో పథకాలు, సదుపాయాలు కల్పించిందని, వాటిని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలను పనులకు పంపించుకునే పాఠశాలకు పంపించి విద్యావంతులుగా కల్పించాలని కోరారు. ఈ క్రీడల్లో 28 ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగు పందాలు, టెన్నిస్ త్రోబాల్, చెస్, బ్యాడ్మింటన్, ఇతర క్రీడల్లో విద్యార్థులు రాణించారు. కార్యక్రమంలో రేణుకారాధ్య, చంద్రయ్య, భూమేష్, వీరేష్, రాజశేఖర్, రేవణ్ణ, నాగన్నగౌడ, బసవరాజు, అశోక్ రెడ్డి, శంకర్ మూర్తి, విష్ణు సిద్దప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం తర్వాతే అందరికీ న్యాయం

● రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మోహన్‌రాజ్



మాట్లాడుతున్న మోహన్‌రాజ్

హోస్పేట,సెప్టెంబరు1:(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో 18వ శతాబ్దంలో శూద్రులకు విద్యాహక్కు లేదని, స్వాతంత్ర్యం తర్వాతి చట్టాలతోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందిని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ మోహన్‌రాజ్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్ ఆడిటోరియంలో జరిగిన కర్ణాటక దళిత సంఘర్ష్ సమితి ఆఫీస్ బేరర్ల ఎంపిక ప్రక్రియలో ఆయన మాట్లాడారు. మొదటగా మెక్‌డొనాల్డ్ నేతృత్వంలోని బ్రిటిష్ ప్రభుత్వం 1813లో చార్టర్డ్ చట్టాన్ని ఆమోదించిందని, లండన్ నుంచి మిషనరీలు భారతదేవానికి వచ్చి సూద్రులకు విద్యను అందించడం ప్రారంభించారు. తరువాత వేలసంవత్సరాలుగా జంతువులలా జీవిస్తున్న వారికి విద్యను అందించడం ద్వారా సమాన సమాజాన్ని సృష్టించాలనే దృఢ సంకల్పంతో సమాన సమాజాన్ని సృష్టించాలనే ధైరవంతమైన ఉద్దేశ్యంతో జనవరి1, 1848న భారతదేశంలో మొదటి పాఠశాల శూద్రుల, శూద్రుల పిల్లల కోసం ప్రారంభించారన్నారు. గంట మోగడంతో చీకటిలో మునిగిపోయిన శూద్రులు వెలుగులోకి వచ్చాయన్నారు. సూర్యజ్యోతిబా పూలే దేశంలో మొదటిసారిగా 1902 శూద్రులకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని ఆయన చరిత్రను వివరంగా చెప్పారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాఆ ఉపాధ్యక్షుడు రాజు ఎం తల్వారా మాట్లాడుతూ ఎవరి నుంచితమ సౌకర్యాలు పొందాలో తెలియక మన ప్రజలు బాధపడుతుండటంచూడటం హృదయ విదారకంగా ఉందన్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం



లడ్డూ వేలం వేస్తున్న కమ్మసంఘం నాయకులు

సిరుగుప్ప, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన వైభవంగా నిర్వహించారు. సిరుగుప్ప తాలుకాలోని కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని పరికరాలను సోమవారం వేలంపాట వేశారు. రూ. 2.75 లక్షలకు లడ్డు, వివిధ సామాగ్రిలను వేలంపాట పాడారు. అనంతరం ప్రధాన రహదారిలో ఊరేగింపు నిర్వహించి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కమ్మసంఘం అధ్యక్షుడు జాలాది రాధాకృష్ణ, కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు ప్రసాద్, చౌదరి, మురళి, కోనేరు గోపాల కృష్ణ, సత్యనారాయణ, రఘు కిరణ్, చెంచురామయ్య, రాధాకృష్ణ, రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట,సెప్టెంబరు1:(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సాధికారత శాఖ ద్వారా గ్రామీణ పునరావాస పథకం కింద హరపనహళ్లి తాలూకాలోని చట్నిహళ్లి గ్రామ పంచాయతీలో 01 గ్రామీణ పునరావస కార్యకర్త పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి రామాంజనేయులు తెలిపారు. దరఖాస్తు దారులు కనీసం ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తీర్ణులై ఉండాలి, 18నుంచి 45సంవత్సరాలు మధ్య వయసుగల అభ్యర్థులు సెప్టెంబరు 2నుంచి 16వరకు ఆౌసరమైన పత్రాలతో పాటు సూచించిన దరఖాస్తు ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చట్నిహళ్లి గ్రామ కార్యకర్తలను హరపనహళ్లి టీఏపీ కార్యనిర్వాహక అధికారుల అధ్యక్షతన ఎంపికచేస్తారు. వివరాల కోసం హరపనహళ్లి తాలూకా ఎంఆర్‌డబ్ల్యు ఆర్ ధనరాజ్ సెల్: 99011 82525నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

హోసూరు జోన్

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు

హోసూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో వీధికుక్కల వల్ల తరచుగా ప్రజలు గాయపడుతున్నారు. ఇందులో భాగంగా మూడున్నరేళ్ల బాలుడు కూడా వీధికుక్కల బారిన పడి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. మాసినాయకనపల్లిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖ, నందలాల్ దంపతుల కుమారుడు సత్య ఉంటున్నారు. వీధిలో సత్య ఆడుకుంటుండగా కుక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచింది. గాయపడిన బాలుడిని తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్సలు పొందుతున్నాడు. వీధికుక్కల దాడులకు నియంత్రణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిమజ్జన వేడుకల్లో డ్యాన్స్ చేస్తూ యువకుడి మృతి



అభిషేక్ (ఫైల్)

రాయచూరు సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉత్సాహంగా సాగుతున్న గణేశ్ ఉత్సవాల్లో సోమవారం తెల్లవారు జామున అపశ్రుతి చోటు చేసుకుంది. నగరంలోని గణేశ్ మండపం నుంచి నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడి విగ్రహం ముందు డ్యాన్స్ చేస్తున్న యువకుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తీన్ ఖందిల్ మీదుగా ఖాసభావి వద్దకు నిమజ్జనానికి తరలిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. కుప్పకూలిపోయిన యువకుడిని ఆస్పత్రికి చికిత్స కోసం వీజీ కులకర్ణి కార్డియాలజీ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి చేర్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అప్పటికే యువకుడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతి చెందిన యువకుడు స్థానిక మంగళవారపెటకు చెందిన అభిషేక్ (24)గా గుర్తించారు.

ఇరువర్గాల ఘర్షణ

● పోలీసుల లాఠీచార్జ్ ● గణేశ్ నిమజ్జనం వేళ గొడవలు

రాయచూరు సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండవ వార్డు పరిధి గద్వాల రోడ్డులో రెండు వర్గాల ఘర్షణకు దిగాయి. ఆదివారం అర్ధరాత్రి వేళ సాగిన గణేశ్ నిమజ్జనం ఊరేగింపులో గలాట చోటు చేసుకుంది. బీజేపీకి చెందిన నరసరెడ్డి, డ్యాడీ వీరేశ్‌ల మధ్య వ్యక్తిగత కారణాల వల్లే ఈ ఘర్షణ తలెత్తినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు వర్గాల వారు పరస్పరం దాడులకు దిగి రాళ్ల మిరప్పుడితో దాడి చేసుకుంటున్నట్లు తెలిసిన పోలీసులు అక్కడికి వెళ్లి ఇరు వర్గాలను శాంతిప చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మార్కెట్ యార్డ్ సబ్ ఇన్స్‌పెక్టర్ కంట్లో కారం పడడంతో పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టేందుకు స్వల్పంగా లాఠీ చార్జ్ చేయాల్సి వచ్చింది. కాగా సోమవారం ఉదయం సైతం రెండు వర్గాలు ఘర్షణకు దిగే వాతావరణం ఉండడంతో పోలీసులు ఆ వార్డులో తగిన బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఇందుకు సంబందించి కేసులేమి నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.



చెరువు ఒడ్డున తేలుతున్న విగ్రహాలు

చెరువులో కరగని విగ్రహాలు.. భక్తుల్లో అసంతృప్తి

హోసూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): వినాయ చవితి సందర్భంగా నగర వ్యాప్తంగా వందలాది గణనాథులను కొలువుదీర్చారు. సంప్రదాయబద్ధంగా ఐదురోజులపాటు పూజలు చేసి ఊరేగించారు. ఆదివారం సాయంత్రం వేర్వేరు చెరువులలో వందలసంఖ్యలో భారీ విగ్రహాలను నిమజ్జనం చేశారు. అయితే కొన్ని విగ్రహాలు పూర్తిగా నీట మునగకపోవడం, నీటిలో కరగకపోవడంతో భక్తులలో అసంతృప్తి నెలకొంది. నిమజ్జనం ప్రక్రియ సాఫీగా సాగినా విగ్రహాలు నీటిలో పూర్తిగా మునగకపోవడం సరికాదని పలువురు అభిప్రాయపడ్డారు. మనోభావాలు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యూజీడీ పనులతో తాగునీటికి అంతరాయం

హోసూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలో భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ) వ్యవస్థ కోసం పైపుల అమరిక పనులు సాగుతున్నాయి. ప్రాంతాలవారీగా అమరిక పనులు చేపట్టారు. కామరాజ్‌నగర్‌లో రెండు నెలలుగా యూజీడీ పనులు సాగుతున్నాయి. ఇటీవల్ల తవ్వకాల సందర్భంగా ఎనిమిదో క్రాస్‌లో తాగునీటి పైపులు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంతో స్థానికులకు తాగునీటి సమస్య నెలకొంది. వెంటనే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



యూజీడీ పైపులు అమర్చిన ప్రాంతం